సమిష్టి కృషితోనే నేరాల నియంత్రణ : డిఐజి

ఏలూరు స్పోర్ట్స్: నేరాల నియంత్రణకు పోలీసులు సమిష్టిగా కృషి చేయాలని, నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏలూరు టూటౌన్‌లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను శనివారం సాయంత్రం వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతితో కలిసి డిఐజి తనిఖీ చేశారు. తొలుత ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. రికార్డులను తనిఖీ చేశారు. క్రికెట్ బెట్టింగ్‌లు, పేకాట స్థావరాలపై ఉక్కుపాదం మోపి, ఎవరినీ ఉపేక్షించకుండా కేసులు నమోదు చేయాలన్నారు. స్పెషల్ ట్రయల్ కేసుల్లో విచారణ త్వరగా పూర్తిచేసి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. సిబ్బంది పనితీరు, వారి విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్లకు ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇస్తూ వారిపై నిఘాపెట్టాలని సూచించారు. నేరాల అదుపునకు పోలీసుల సంఖ్య పెంచి ఎప్పటికప్పుడు నగరంపై నిఘా ఉంచాలని ఆయన సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేస్తూ వాహనాలను సీజ్ చేయాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

చేతికొచ్చిన పంట చేజారే..!

- 'చివరి' దశలో అందని సాగునీరు
- అడుగంటిని పంట కాలువలు
- ఎండుతున్న వరి పంటలు
- ఆందోళనలో రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

పూర్తిగా ఎండిన వరిచేను

ప్రజాశక్తి - ముదినేపల్లి

అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వర్షాభావంతో చేతికొచ్చిన పంట చేజారిపోతోంది.. పంట చేతికొచ్చే సమయాన సాగునీరందక అన్నదాతలు విలవిల్లాడుతున్నారు. పాలకులు, అధికారుల అనాలోచిత నిర్ణయాలతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల శివారు పంటలకు నీరందక పంటపొలాలు నిలువెల్లా బీటలు వారడంతో దిక్కుతోచని స్థితిలో రైతులున్నారు.

పొట్టదశలో సాగునీరు అందక ఎండిపోతున్న వరిచేను

మునుపెన్నడూ లేని విధంగా మండలంలో సాగునీరందక రైతులు అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అధికారులు, పాలకులు తమపై దయచూపాలని మండల రైతాంగం చేతులెత్తి అధికారులను వేడుకుంటోంది. ముదినేపల్లి మండల రైతులు అనేక ఆటుపోట్ల మధ్య ఈ ఏడాది ఖరీఫ్ సాగు చేపట్టారు. అయితే సాగు ఆది నుండి రైతన్న ఆటుపోట్లకు గురయ్యారు. తీవ్ర వర్షాభావం, ఎండల కారణంగా వేసిన పైరు ఎండిపోయి, వెదజల్లిన విత్తనాలు మొలకెత్తక రైతన్న అనేక పాట్లు పడ్డారు. దీంతో రెండు, మూడు దఫాలుగా నాట్లు వేయడం, విత్తనాలు వెదజల్లారు. ప్రస్తుతం వరిచేలు చిరుపొట్ట, ఈనిక దశల్లో ఉన్నాయి. ఈ దశలో సరిపడు సాగునీరు చాలా అవసరమని రైతులు చెబుతున్నారు. కాలువల ద్వారా నీరు పుష్కలంగా రాకపోవడంతో పాటు, వంతులవారీ విధానం కారణంగా మండలంలోని శివారు భూములకు నీరందకపోవడంతో చేలు ఎండిపోతున్నాయి. దీంతో మండలంలోని అనేక గ్రామాల రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 15 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. అయితే 12 గ్రామాల్లో సాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ఆయా గ్రామాల్లో చేలు ఎండిపోతున్నాయి. దీంతో పంట దిగుబడులు తగ్గిపోతాయంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలవ్యాప్తంగా రెండు వేల ఎకరాలకు పైగా నీటి ఎద్దడి ఏర్పడినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కాలువల ద్వారా అరకొరగా నీరు రావడంతో ఆక్వా రైతులు ఇంజన్ల ద్వారా చేపల చెరువులకు ఆ నీటిని మళ్లిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో శివారు భూములకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వణుదుర్రు, దేవపూడి, ఈడేపల్లి, కొరగుంటపాలెం, పొద్దువాక, వైవాక, వాడవల్లి, కోడూరు, చిన పాలపర్రు, చిగురుకోట, పెదకామనపూడి, గురజ, ముదినేపల్లి, బొమ్మినంపాడు, సింగరాయపాలెం తదితర గ్రామాల్లో ఖరీఫ్ సాగుకు నీటి సమస్య ఏర్పడింది. సాగునీటి ఎద్దడి కారణంగా చేతికి వచ్చిన వరిచేలు కళ్లెదుటే ఎండిపోవడంతో ఏమి చేయాలో పాలుపోక మండల రైతులు అయోమయ పరిస్థితిలో పడ్డారు. జల వనరుల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేసి పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

సిపిఎస్ రద్దుపై స్పష్టత ఇచ్చే వారికే మద్దతు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వారికే వచ్చే ఎన్నికల్లో ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓట్లు వేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. జిల్లా యుటిఎఫ్ ఆఫీస్ బేరర్స్ సమావేశం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా అలీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకమాట అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమాట చెబుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడం ఎల్లప్పుడూ సాగదని ఈ ప్రభుత్వాన్ని విమర్శించారు. పాత పెన్షన్ విధానం అమలు చేసే విషయంలో రాజకీయ పార్టీలు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ అమలు చేస్తే ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని, కార్పొరేట్ పాలక పక్షాల వైపు మాట్లాడే పద్ధతిని జయప్రకాష్ నారాయణ వంటి వారు మానుకోవాలని సూచించారు. ఉద్యోగుల హక్కుగా ఉన్న పెన్షన్‌ను రద్దుచేసి పాలకులు దయాదాక్షిణ్యాల మీద ఆధారపడేలా చేయడం సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయుల హక్కుగా ఉన్న పాత పెన్షన్‌ను పునరుద్ధరించాల్సిందేనని డిమాండ్ చేశారు. జిపిఎస్ వల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదని పేర్కొన్నారు. ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డిఎ, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో సంస్కరణల వల్ల నాణ్యమైన విద్య అందడం లేదని, అలాగే ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలలకు వెళ్తున్నారని, ఈ మేరకు జిఒ 117ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, వి.కనకదుర్గ, కోశాధికారి జివి.రంగమోహన్, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, సిపిఎస్ కన్వీనర్ కె.కమల్‌కుమార్, ఆడిట్ కన్వీనర్ మోహనరావు, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సిపిఎం ప్రజారక్షణ భేరి సభ విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణభేరి ముగింపు సందర్భంగా విజయవాడలో ఈ నెల 15వ తేదీన జరిగే బహిరంగసభను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. స్థానిక పవర్‌పేటలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరినొకరు తిట్టుకుంటూ ప్రజాసమస్యలను గాలికొదిలేశాయన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపి పట్ల మెతక వైఖరి అవలంభిస్తున్నారని విమర్శించారు. ప్రశ్నిస్తామన్న జనసేన నోరెత్తడం లేదని, బిజెపిని పొగడడమే పనిగా పెట్టుకున్నారన్నారు. దీంతో రాష్ట్రంలోని ప్రజల సమస్యలు పక్కదారిపడుతున్నాయని, అధికార ప్రతిపక్ష పార్టీలు అవినీతిలో కూరుకుపోయాయని, ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఏలూరులో జ్యూట్ మిల్లు మూతపడినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జిల్లాలో ప్రజలకు ఉపాధి, కార్మికులకు కనీస వేతనాల్లేక, అధిక ధరలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండాగా సిపిఎం ప్రజా రక్షణ భేరి నిర్వహిస్తుందని, జిల్లా నుండి ప్రజానీకం పెద్ద సంఖ్యలో బహిరంగ సభలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బి.సోమయ్య, జి.నరసిం హారావు, పి.ఆదిశేషు, కొర్రి విజయలక్ష్మి, నగర నాయకులు వి.సాయిబాబా, బి.జగన్నాధరావు, పి.హైమ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : ఈనెల 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రజారక్షణ భేరి యాత్ర పోస్టర్లను, పార్టీ విధివిధానాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ మండలం నుంచి సుమారు వెయ్యి మంది వరకూ వెళ్లేలా విస్తృత ప్రచారం నిర్వహించామన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని ఒంటరి చేసి ఓడించడమే సిపిఎం లక్ష్యమన్నారు. దేశం బాగుపడాలంటే బిజెపిని ఓడించాలన్నారు. ఈ సభకు మండలంలో ప్రజలను తరలించేందుకు నాలుగు లారీలు, ఆరు టాటా ఏస్‌లు, పది కార్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎన్‌వి.అప్పారావు, సిరిబత్తుల సీతారామయ్య, గుండు గంగరాజు, కొండలరావు, కారం దుర్గ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పాలస్తీనాకు సంఘీభావంగా కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అమెరికా సామ్రాజ్యవాద దేశ మద్దతుతో పాలస్తీనాపై సాగిస్తున్న యుద్ధన్మోధాన్ని నిరసిస్తూ శనివారం సాయంత్రం ఏలూరులో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పవర్ పేట రైల్వే స్టేషన్ నుండి ఆర్ఆర్ పేట పార్కు వరకూ సాగింది. పార్కు వద్ద జరిగిన సభకు సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, సిపిఐ నగర కార్యదర్శి యు.హేమ శంకర్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడారు. మూడు నెలలుగా పాలస్తీనాలోని గాజాపై అమెరికా సాయంతో ఇజ్రాయిల్ బాంబులు వర్షం కురిపిస్తుందని తెలిపారు. ఈ దాడుల్లో వేలాది మంది అమాయక చిన్నారులు, వృద్ధులు, పౌరులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రపంచశాంతిని కోరుకునే ప్రతిఒక్కరూ ఈ దాడులను ఖండించాలన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం భారత దేశ అలీన విధానాన్ని వీడి అమెరికాకు అనుకూలంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ప్రజాసామ్యవాదులు ఈ దాడులను ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, పి.ఆదిశేషు, నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్, కంట్రోల్ కమిషన్ సెక్రెటరీ బండి వెంకటేశ్వరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు యర్రా శ్రీనివాసరావు, కాకి నాని, క్రాంతి పాల్గొన్నారు.

చాలీచాలని వేతనాలు.. మెనూ ఛార్జీలు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై యూనియన్ జిల్లా కార్యదర్శి నాగమణి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ మండల కమిటీ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ జిల్లాలో మూడు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరంతా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగనన్న గోరుముద్దకు ప్రభుత్వం ఇస్తున్న మెను ఛార్జీలకు సంబంధం లేకుండా, రోజుకో రకంతో భోజనం తయారు చేసి పెట్టాలంటూ వర్కర్లపై ఆర్థిక భారం మోపుతుందన్నారు. ఒకపక్క పని భారం, మరోపక్క పెరిగిన ధరలు, చాలీచాలని వేతనాలు, ప్రభుత్వం ఇచ్చే మెనూ ఛార్జీలతో పథకం నిర్వహణ కష్టంగా మారిందన్నారు. రాగిజావ తయారీకి గ్యాస్ సిలిండర్, వంట పాత్రలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాగి జావ తయారీలో కార్మికులు ఉదయం ఏడు గంటల నుండి పనిచేయాల్సి వస్తుందన్నారు. పెరిగిన ధరలతో వర్కర్లు సతమతమవుతున్నారన్నారు. మెనూలో లేకుండా శనివారం పొంగలి చేయాలని చెప్పడం సరికాదన్నారు. 'గోరుముద్ద' తినని పిల్లలకు గుడ్డు, చిక్కీ ఇవ్వాలని, గుడ్డు ఉడకపెట్టడానికి గ్యాస్ ఖర్చు అదనంగా వర్కర్లపైనే పడుతోందన్నారు. అలాగే కార్మికులకు బీమా, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు లేవన్నారు. ప్రథమ చికిత్స కిట్లు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. కొన్ని పాఠశాలల్లో వంట షెడ్లు, వంట పాత్రలు, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించకుండా మెనూలో మార్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.5.88, ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.8.57తో నాణ్యమైన పౌష్టికాహార భోజనం పెట్టడం ఎలా సాధ్యమనేది ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగాయని వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, రాగి జావ తయారీకి వంట పాత్రలు, గ్యాస్ స్టవ్, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే ఇవ్వాలని, ఒక్కో విద్యార్థికి మెనూ ఛార్జీలను రూ.20కు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెల ఐదో తేదీన వేతనం, బిల్లులు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, యూనిఫారాలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో నక్క కృష్ణవేణి, శీలం పల్లయమ్మ, గుండుగోలు ఎర్రమ్మ, ఎ.కృష్ణవేణి పాల్గొన్నారు.

చింతలపూడిని కరువు మండలంగా గుర్తించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిని కరువు మండలంగా గుర్తించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో శనివారం సిపిఐ రాష్ట్ర బృందం వర్షాభావంతో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. పాతచింతలపూడి, సమ్మెటవారిగూడెం, మల్లాయగూడెం గ్రామాల్లో పర్యటించారు. సమ్మెటవారిగూడెంలో రావెల రాజా, ఉలవ రాఘవరావు, వనమాల శ్రీను, మల్లాయగూడెంలో వెల్ది రవీంద్ర, టంగుటూరి రామ్మోహన్‌రావు, మిర్యాల శ్రీనివాసరావు పొలాల్లో పర్యటించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ చింతలపూడిని తక్షణం కరువు మండలంగా ప్రకటించాలని, ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, సర్వే నెంబర్ ఆధారంగా పంట నష్టపరిహారాన్ని వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ వర్షాభావం వల్ల ఎకరాకు రూ.30 బస్తాల ధాన్యం దిగుబడి రావాల్సిన పంట ఐదారు బస్తాలకు మించి రావడం లేదని, పండిన ధాన్యాన్ని మొత్తం గ్రేడ్లతో సంబంధం లేకుండా ప్రభుత్వమే ఆర్‌బికె ద్వారా కొనుగోలు చేయాలని, క్వింటాల్‌కు రూ.మూడు వేలు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి మనవ కృష్ణచైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తుర్లపాటి బాబు, సిపిఐ మండల సమితి సభ్యులు ఎస్‌కె మస్తాన్, ఎపి రైతు సంఘం నాయకులు తక్కెళ్లపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

17న సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు

ఈనెల 17న సిఎం జగన్ జిల్లా పర్యటనలో ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అధికారులకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో డివిజనల్ స్థాయి సమీక్షా సామావేశం శనివారం డిపిఒ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిఎం జగన్ పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు జిల్లాకు వస్తున్నారని, ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, విస్తరణ అధికారులతో ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించాలన్నారు. హెలీప్యాడ్, ఎంఐజి లేఅవుట్, వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో ముఖ్యంగా హెలీప్యాడ్ నుంచి బహిరంగసభా ప్రాంగణం వరకూ రోడ్డు మార్గంలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. నూజివీడు పట్టణం పరిసరప్రాంతాల్లో 14 గ్రామ పంచాయతీలను గుర్తించామని, ఈ ప్రాంతాల్లో డ్రెయినేజీలు శుభ్రం చేయాలని మలాథియన్ స్ప్రే చేయాలని, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయాలని, ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు 450 మంది కార్మికుల సేవలను, 200 మంది పంచాయతీ కార్మికులను వినియోగించనున్నామని తెలిపారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని డిపిఒ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డివిజనల్ పంచాయతీ అధికారి సుందరి పాల్గొన్నారు.

గుర్తుతెలీని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన శనివారం రాత్రి ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి వద్ద జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన మంగర విజయమార్కండేయులు(24) హైదరాబాద్‌లోని ఓ చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన ఆయన తిరిగి ద్విచక్ర వాహనంపై ఉదయం హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఆశ్రం ఆసుపత్రికి వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయమార్కండేయులు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతునికి భార్య శివదుర్గ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్వారకాతిరుమల టిడిపిలో గ్రూపు విబేధాలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల టిడిపిలో గ్రూపు విబేధాలు మరోసారి భగ్గుమన్నాయి. గోపాలపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజుపై కొంతమంది టిడిపి నాయకులు గతకొంతకాలంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. అయితే దీనికి వెంకటరాజు ఏకపక్ష నిర్ణయాలే దీనికి కారణమని పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ తరుణంలో వెంకటరాజు భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతున్నారు. అయితే ఆయన అదరినీ కలుపుకుని వెళ్లకుండా కొంతమంది నాయకులతో మాత్రమే తిరుగుతున్నారు. ఎప్పటినుంచో టిడిపి జెండాను మోసిన నాయకులను కాదని 2019లో టిడిపి ఓడిపోగానే ఇంటి నుంచి బయటకు రాని నాయకులకు ప్రాధాన్యతిస్తూ గ్రామంలో తిరుగుతున్నారని పలువురు పార్టీ నేతలే బహిరంగంగా చెబుతున్నారు. దీంతో వీరంతా శనివారం సమావేశమై మద్దిపాటి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. టిడిపి అధిష్టానం దీనిపై దృష్టిపెట్టి మద్దిపాటికి కాకుండా అందరినీ కలుపుకునిపోయే నేతకు టిక్కెట్ ఇచ్చి నియోజకవర్గంలో టిడిపిని గెలిపించుకోవాలని వారు సూచిస్తున్నారు. ఈ సమావేశానికి హాజరైన వారిలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కె.బుజ్జియాదవ్, నియోజవర్గ వాణిజ్యసెల్ అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ, బిసి సెల్ మండల అధ్యక్షులు రేవూరి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి వెంకన్న, పార్టీ సీనియర్ నాయకులు గువ్వల మావుళ్లరావు, గువ్వల నాగచంద్రం, చిలుకూరి హరిబాబు, తాడేపల్లి సుబ్బారావు, కటికల సుబ్రహ్మణ్యం, ఆర్.ఫణీంద్రచౌదరి, రాచప్రోలు బాలరాజు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాల మీదుగా రోడ్డును అడ్డుకుంటాం : సిపిఎం

ప్రజాశక్తి - మండవల్లి

పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల మీదుగా రోడ్డు వేస్తే అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, లబ్ధిదారులు హెచ్చరించారు. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు మెరకచేయాలని, పేదల ఇళ్ల స్థలాల మీదగా రహదారిని వేయొద్దంటూ లబ్ధిదారులు ఇళ్ల స్థలాల ప్రాంతంలో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల ఇళ్ల స్థలాలను మెరక చేయాలని లబ్ధిదారులు పలుమార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్న తీరు చెవిటివాడి చెవిలో శంఖం ఊదినట్లు ఉందన్నారు. 2006లో ఇచ్చిన ఈ స్థలాలను నేటికీ మెరక చేయకపోవడం దారుణన్నారు. దీనిపై అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. గుడివాడ నుండి కైకలూరు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి సేకరించిన భూమిలో నుండి కాకుండా పేదల ఇళ్ల స్థలాల మీదగా రోడ్డు నిర్మించేందుకు అలైన్‌మెంట్ మార్చేయడం దుర్మార్గమన్నారు. రోడ్డు నిర్మాణానికి పేదల ఇళ్ల స్థలాలే కనిపించాయా అంటూ ఆయన అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమం అని చెప్పుకుంటూ 17 సంవత్సరాలుగా ఇళ్ల స్థలాలను మెరకచేయకుండా పేదలను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంఎల్ఎ ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్ల స్థలాలు మెరకచేసి ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఈనెల 15న విజయవాడలో జరుగుతున్న సిపిఎం ప్రజా రక్షణభేరి బహిరంగసభను ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు బుద్ధుల రాముడు, గిరిజాల బాపనాచారి, ఆర్.రూతమ్మ, జి.సుజాత, పి.రోజాపుష్పం, కె.రామారావు, కె.కమల, జి.ఏడుకొండలు, బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఎవరిది..?



వరుస ఘటనలు.. గాలిలో ప్రాణాలు.. అనే పరిస్థితి రెండు జిల్లాల్లో నెలకొంది. ఆర్‌టిసి, కళాశాల బస్సుల ప్రమాదాలు తీవ్ర భయభ్రాంతులకు గురి చేశాయి. ఆచంట మండలంలో కరెంటు స్తంభం పడి విద్యార్థి దుర్మరణం తీవ్ర ఆవేదనకు గురిచేశాయి. ఈ ఘటనలన్నింటికీ నిర్లక్ష్యం ఎవరిదనే అంశంపై సర్వత్రా చర్చ సాగుతోంది.

పర్యవేక్షణ, తనిఖీ యంత్రాంగాలను పాలకులు నిర్వీర్యం చేయడంతో రహదారి ప్రమాదాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దీనికితోడు అధ్వానంగా తయారైన రోడ్ల పరిస్థితి ప్రమాదాల తీవ్రతను మరింత పెంచుతోంది. ఏలూరు సమీపంలో కళాశాల బస్సు బోల్తా పడి సుమారు 20 మంది విద్యార్థులు గాయాల పాలవ్వడం, తాడేపల్లిగూడెంలో విద్యాసంస్థ బస్సు ఢీకొని అదే విద్యాసంస్థకు చెందిన విద్యార్థి దుర్మరణం చెందడం అందరినీ కలచివేసింది. ఏలూరు ఘటన జరిగిన తర్వాత రెండు రోజులు రవాణాశాఖాధికారులు ప్రయివేటు విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేసి హడావుడి చేశారు. కనీసం డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు ఈ బస్సులను నడుపుతున్నారంటే తనిఖీ వ్యవస్థ నిర్లక్ష్యం, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాల బరితెగింపు ఏస్థాయిలో ఉందో అర్థమవుతోంది. అనుమతులు, ఫిట్‌నెస్ లేని బస్సుల సంగతి వేరే చెప్పనవసరం లేదు. మరి ఈ స్థాయిలో ప్రయివేటు విద్యాసంస్థల బస్సులు పెద్దసంఖ్యలో విద్యార్థులతో రోడ్లపై పరుగుపెడుతూ అటు విద్యార్థుల, ఇటు రోడ్లపై ప్రయాణించే సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంటే సంబంధిత శాఖల అధికారులు ఏం చేస్తున్నారనేది అందరినీ వేధిస్తున్న ప్రశ్న.

ఇక ఆర్‌టిసి బస్సులు తరచూ రోడ్లపై మొరాయిస్తున్నాయి. ఎక్కడ ఏ బస్సు ఆగిపోతుందో తెలియని పరిస్థితి. ఇటీవల జంగారెడ్డిగూడెంలో నిడదవోలు డిపోనకు చెందిన ఆర్‌టిసి బస్సులో మంటలు రావడం, వీరవాసరంలో భీమవరం డిపో బస్సు అదుపు తప్పి కుడిపక్కకు దూసుకెళ్లి మోటారు సైక్లిస్టు మృతికి కారణం కావడంతో ఆర్‌టిసి బస్సులు కన్పిస్తేనే కంగారుపడే పరిస్థితులు నెలకొన్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. వీరవాసరం ఘటనలో బ్రేకులు ఇతర సమస్యలపై డ్రైవర్లు గ్యారేజీలో వివరించినా అదే బస్సును ఇచ్చి పంపడం అధికారుల, ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు. విజయవాడ బస్టాండులో ప్లాట్‌ఫారంపైకి బస్సు దూసుకెళ్లడానికి పర్యవేక్షణాధికారుల తప్పిదమే కారణమని, ఫలితంగా మూడు ప్రాణాలు గాలిలో కలిశాయనేది అందరికీ తెలిసిందే. ఆ ఘటన తర్వాత కూడా కనీసం డిపోస్థాయి అధికారులు అప్రమత్తంగా లేకపోవడం, ప్రభుత్వం నుంచి కనీసం హెచ్చరికలు లేకపోవడం ప్రజారవాణా వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే ప్రభుత్వ విధానాలకు ప్రతిబింబంగా చెప్పుకోవచ్చు. గ్యారేజీలో పలు విభాగాలను ప్రయివేటుపరం చేయడం, స్పేర్ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో బస్సుల పరిస్థితి అధ్వానంగా తయారవుతోంది. దీనికితోడు రోడ్లు అధ్వానంగా ఉండటంతో బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వీటికి తాత్కాలిక ప్రాతిపదికన మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రభుత్వం సైతం కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా డొక్కు బస్సులనే తిప్పడం, అద్దె బస్సులపైనే ఎక్కువ ఆసక్తి చూపడం గమనార్హం. మొత్తంగా ప్రభుత్వ విధానాల ఫలితంగా ఆర్‌టిసి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని పరిశీలకులు చెబుతున్నారు.

ఆచంట మండలం అయోధ్యలంక గ్రామ పరిధిలోని మర్రిమూలలో పాఠశాల విద్యార్థిపై కరెంటు స్తంభం పడి మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది. స్తంభం పడిపోయే ప్రమాదం ఉందని ఆ గ్రామస్తులు పదేపదే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఒక చిన్నారి ప్రాణం కోల్పోవడంపై ఎవరు బాధ్యత వహిస్తారో పాలకులే చెప్పాలి.

'మళ్లీ జగనే ఎందుకు కావాలి' అని ఊకదంపుడు ప్రచారం చేస్తున్న వైసిపి శ్రేణులు, దీనికి వంతపాడుతున్న అధికారగణం ఈ ఘటలన్నింటికీ సమాధానం చెప్పి ఆ ప్రచారం చేసుకుంటే మంచిదని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. లేని పక్షంలో 'మళ్లీ జగనే ఎందుకు వద్దు' అనేది ప్రజలే చెబుతారని హెచ్చరిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - భీమడోలు

స్థానిక గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు తెలిపారు. 14వ తేదీన గ్రంథాలయ వారోత్సవాలను మండల సర్పంచ్ చాంబర్ అధ్యక్షులు, భీమడోలు సర్పంచి పాము సునీత మార్నింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తారన్నారు. మండల పరిషత్ అధ్యక్షుడు కనమాల రామయ్య ముఖ్యమంత్రి సందేశ కరపత్రాలను ఆవిష్కరిస్తారన్నారు. భీమడోలు జెడ్‌పిటిసి తుమ్మగుంట భవాని రంగా పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తారన్నారు. భీమడోలు ఎంపిపి చైర్పన్ ఐంజేటి నీలిమా జూనియర్ గ్రంథాలయ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు మద్దుల ఫణి పద్మజ రాజా జాతీయ నాయకుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటన చేసి వారిని సత్కరిస్తారని తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం నుంచి 20వ తేదీ వరకు ప్రముఖుల ఆధ్వర్యంలో రోజువారి వివిధ అంశాలపై చర్చా గోష్టులను, పలు అంశాలలో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈనెల 21వ తేదీన భీమడోలులో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా పోటీలలో పాల్గొన్న విజేతలకు బహుమతి ప్రధానం చేస్తామని గ్రంథ పాలకులు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

మద్యం పట్టివేత

చాట్రాయి : మండలంలోని కృష్ణారావుపాలెం చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలలో తెలంగాణా, యానాంలకు చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి ఎన్.సూరి చంద్రరావు తెలిపారు. జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి ఆదేశాలపై ఎస్ఇబి టాస్క్ ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ కృష్ణ ధనరాజుకి రాబడిన సమాచారం మేరకు, నూజివీడు ఎస్ఇబి ఇన్స్‌పెక్టర్ గోపాలకృష్ణ, ఎస్ఐ అల్లురయ్య, హెడ్ కానిస్టేబుల్ కెవివి.సత్యనారాయణ, ఎక్సైజ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ సింగ్‌లతో కలిసి తనిఖీ నిర్వహించామన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పామర్తి గోపాలకృష్ణ తండ్రి వెంకటేశ్వరరావు వద్ద నుంచి సుమారు 100 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిని విచారించగా అతను ఇచ్చిన సమాచారం మేరకు తెలంగాణా రాష్ట్రం, యానాంకు చెందిన 97 ఫుల్ బాటిళ్లు, 706 క్వార్టర్ బాటిళ్లు మొత్తం 803 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతనిపై నూజివీడు ఎస్ఇబి పోలీస్ స్టేషన్‌లో కేసును నమోదు చేసినట్లుగా జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి తెలియజేశారు.

30 లీటర్ల నాటుసారా స్వాధీనం

900 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

టి. నరసాపురం : మండలంలోని కృష్ణాపురంలో ఆదివారం చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భుక్యా రాజా అక్రమంగా నిల్వ ఉంచిన 100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సిఐ సుంకర సాయి స్వరూప్ తెలిపారు. అదే గ్రామాల్లో వేరో చోట లభించిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో మూడో ముద్దాయి అరెస్ట్

జీలుగుమిల్లి : గంజాయి కేసులో మూడో ముద్దాయిని అరెస్టు చేసినట్లు సిఐ బి.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో 2022లో ట్రాలీ లారీలో గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ కేసులో అప్పట్లో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మూడో ముద్దాయి మొగ్గ రామారావు పరారీలో ఉండగా అతడిని శుక్రవారం రాత్రి తాటియాకులగూడెం టెంపుల్ వద్ద అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో దొంగల హల్‌చల్

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి ప్రధాన రహదారిలో ఉన్న పలు షాపులలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించినట్లు బాధితులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక బజాజ్ షోరూంలో తాళాలు పగలకొట్టి లోపల ఉన్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి, రూ.లక్ష వరకు నగదును అపహరించుకు పోయినట్లు షోరూం సిబ్బంది తెలిపారు. అదేవిధంగా పక్కనే వున్న హీరో షోరూంలోకి చొరబడి కొంత నగదుతో ఉడాయించినట్లు బాధితులు వాపోతున్నారు. అనంతరం ఇంకో రెండు షాపులలో తాళాలు పగలకొట్టి పోయినట్లు తెలుపుతున్నారు. ఎస్ఐ వి.చంద్ర శేఖర్ సంఘటన స్థలాలకు చేరుకొని చోరీ జరిగిన ప్రాంతాలను పరిశీలించారు.

ప్రియుడే హంతకుడు

పోలవరం : మండలంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో బాపూజీ కాలనీలో నివాసం ఉంటున్న సంకురు బుజ్జమ్మ(39)ను ఆమెతో సహజీవనం చేస్తున్న ఇదే గ్రామానికి చెందిన షేక్ సుభాన్(35) హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు దగ్గరకు చేరనివ్వట్లేదు అనే ఈర్ష్య, ద్వేషం, అనుమానంతో ఈనెల 10న ఉదయం పథకం ప్రకారం మృతురాలి కొడుకు ఇంట్లో లేని సమయం చూసి ముద్దాయి తనతో తెచ్చుకున్న స్టీల్ చాకుతో ఆమెపై విచక్షణారహితంగా దాడిచేసి పొడిచి చంపాడు. మృతురాలి కొడుకు శంకర్ బాబు ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి ఉత్తర్వుల మేరకు ఏలూరు డిఎస్‌పి ఈ.శ్రీనివాసులు దర్యాప్తు చేపట్టారు. షేక్ సుభాన్ హత్య చేసినట్లు తేలడంతో ముద్దాయిని అరెస్ట్ చేసి అనంతరం జంగారెడ్డిగూడెం మేజిస్ట్రేటు కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసు దర్యాప్తులో పోలవరం సిఐ కె.విజయ బాబు, పోలవరం ఎస్ఐ.పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
యాడ్స్ డిజైనర్:
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తి చేసి,
తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చి పేజ్‌మేకర్/క్వార్క్ ఎక్స్‌ప్రెస్,
ఫోటోషాప్‌లలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

కలాం ఆశయ సాధనకు కృషి చేయాలి

ఘనంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి యం.వెంకటేశ్వర్లు సూచించారు. స్వతంత్ర సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం ఆజాద్ విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. మైనారిటీ విద్యా, వెనుకబడిన వర్గాల వారీ విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. వారు విద్యారంగంలో తీసుకువచ్చిన మార్పులు భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎన్ఎస్.కృపావరం, కలెక్టరేట్ ఎఒ ఎస్.రమాదేవి, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు చల్లన్న దొర పాల్గొన్నారు.

చాట్రాయి పాఠశాలలో అబ్దుల్ కలాంకు నివాళు లర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చాట్రాయి : మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవాన్ని సూరంపాలెం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎం.ముత్తయ్య మాట్లాడుతూ అబ్దుల్ కలాం నూతన విద్యావ్యవస్థను రూపొందించారని ఆయనకు ఘన నివాళులర్పించడం మనందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలోని పలు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో దేశ ప్రథమ విద్యాశాఖా మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. భీమడోలు తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం ఆవరణలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, రీడర్స్ ఫోరం, గ్రంథపాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగా, అతిథిగా స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్సింగ్ పాల్గొన్నారు. వీరందరూ అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, మద్దాల అప్పారావు పాల్గొన్నారు.

'మాకు మీరే న్యాయం చేయాలి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

మాకు మీరే న్యాయం చేయాలంటూ మండలంలోని వడాలి గ్రామస్తులు శనివారం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావును కైకలూరులోని ఆయన స్వగృహంలో కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ దేవాలయ ధర్మాదాయ శాఖ నుంచి తమ నివాస ప్రాంతాలను ఖాళీ చేయవల్సిందిగా తమకు నోటీసులు జారీ చేశారన్నారు. ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న మా ప్రాంతాలను అధికారులు ఖాళీ చేయాలని చెప్పడంతో ఏమి చేయలో పాలుపోని పరిస్థితి ఏర్పడిందన్నారు. తమకు మీరే న్యాయం చెయ్యాలని డిఎన్ఆర్‌కు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నేత ఈడే వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి పోలగాని నాగ రంగారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో టపాసుల దుకాణాలు ఏర్పాటు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల వ్యాప్తంగా దీపావళి మందుగుండు సామాగ్రి విక్రయించేందుకు 10 దుకాణాలకు అనుమతి ఇచ్చినట్లు ఎస్ఐ డి.వెంకట కుమార్ శనివారం తెలిపారు. ఈమేరకు ఆయన దుకాణాలు ఏర్పాటు చేసిన గ్రామాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదినేపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఐదు దుకాణాలు, సింగరాయపాలెం సెంటర్‌లో నాలుగు దుకాణాలు, అల్లూరు సెంటర్‌లో ఒక దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు వ్యాపారులకు అనుమతినిచ్చినట్లు తెలిపారు. మందుగుండు సామాగ్రి విక్రయించే వ్యాపారులు ఎటువంటి ప్రమాదాలు జరక్కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దుకాణాలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో నీళ్ల, ఇసుక ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు, షరతులు పాటించి విక్రయాలు జరుపుకోవాలని వ్యాపారులకు సూచించారు.

హెచ్ఐవి చిన్నారులకు పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు

మానవత ఏలూరు సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి సోకిన బాలబాలికలకు పోషకాహారం పంపిణీ చేశారు. శనివారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని ఆర్‌బిఎస్‌కె సెంటర్‌లో 25 మంది హెచ్ఐవి బాలబాలికలకు మానవత జిల్లా కేంద్ర నియంత్రణ, విద్యానిధి కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, అందె ముసలయ్య, పఠాన్ హుస్సేన్ ఖాన్, షేక్ షబీరున్నీసా సౌజన్యంతో నెలకు సరిపడా పోషకాహారాన్ని అందజేశారు. నందిగం అపూర్వ, నందిగం దివ్యశ్రీ సౌజన్యంతో శనివారం భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ శర్మిష్ట, శ్రీనివాస్, డా.బ్యూలా, మానవత ఏలూరు యూనిట్ అధ్యక్షులు మేతర అజయ్ బాబు, ఏలూరు రీజియన్ ఛైర్మన్ పోలవరపు దేవరత్నాకరరావు, ఏలూరు మండల ఛైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల పాల్గొన్నారు.

బాధితునికి ట్రేస్ ఇండియ సహకారం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ట్రేస్ ఇండియా వారి సహకారంతో కేరళ వెళ్లి బస్సు యాక్సిడెంట్ నుంచి కోలుకొన్న మాదేపల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన ప్రసాదం గోపి కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రేస్ ఇండియా అధ్యక్షులు, జిల్లా ఎల్‌సిఐఎఫ్ కోఆర్డినేటర్ ఎంజిఎఫ్ లయన్ దిడ్ల ఆంజి, జిల్లా ఛైర్‌పర్సన్ కృష్ణారావు, క్లబ్ ట్రెజరర్ పి.శివ కుమార్, క్లబ్ డైరెక్టర్ ఆంథోనీ ప్రదీప్ కుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొదటి దశ ఓటింగ్ యంత్రాల పరిశీలన పూర్తి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీలను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పూర్తిచేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో అక్టోబరు 16న మొదలైన ఈవిఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ శుక్రవారంతో పూర్తయిందన్నారు. జిల్లాకు నూతనంగా కేటాయించబడిన బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివిప్యాట్‌ల మొదటిస్థాయి తనిఖీ బెంగుళూరుకు చెందిన భారత్ ఎలక్ట్రానిక్ ఇంజనీర్లు తనిఖీ చేశారన్నారు. జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అక్టోబరు 16వ తేదీన ప్రారంభించబడి ఈనెల 10వ తేదీన మాక్ పోల్ నిర్వహించడం ద్వారా మొదటిస్థాయి తనిఖీ కార్యక్రమం ముగిసిందన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 5,545 బ్యాలెట్ యూనిట్లు తనిఖీ చేయగా 5,494 పనిచేస్తున్నాయన్నారు. 4,421 కంట్రోల్ యూనిట్లను తనిఖీ చేయగా 4,406, పనిచేస్తున్నట్లు, 5,297 వివిప్యాట్‌లు తనిఖీ చేయగా 5,254 పనిచేస్తున్నట్లు గుర్తించారన్నారు. మొదటిస్థాయి తనిఖీల అనంతరం 51 బియు, 15 సియు, 43 వివిప్యాట్లు పనిచేయని యంత్రాలను తిరిగి బెంగుళూరుకు పంపడం జరుగుతుందన్నారు. మొదటిస్థాయి తనిఖీ కార్యక్రమానికి డిఆర్‌డిఎ పిడి డాక్టర్ ఆర్.విజయరాజు పర్యవేక్షకులుగా వ్యవహరించారని కలెక్టర్ తెలియజేశారు.

నిబంధనలకు అనుగుణంగానే దీపావళి దుకాణాలు

51 మందికి మందుగుండు సామాగ్రి విక్రయానికి అనుమతులు
తహశీల్దార్ సోమశేఖర్

ఏలూరు : నగరంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మందుగుండు షాపులు తనిఖీ చేసి లైసెన్స్‌తో పాటు ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకున్నారా లేదా అని తనిఖీ చేశామని ఏలూరు తహశీల్దార్ సోమశేఖర్, త్రీ టౌన్ సిఐ శివాజీ, ఎస్ఐ మణికుమార్, ఫైర్ సేఫ్టీ అధికారులు, రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 51 మందికి మందుగుండు సామాగ్రి విక్రయానికి అనుమతిచ్చామని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా దీపావళి పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సిఐ శివాజీ మాట్లాడుతూ ఇండోర్ స్టేడియంలో అమ్మకాలకై సంబంధిత శాఖల సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. మందుగుండు సామాగ్రి విక్రయాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే విక్రయించాలని, అలా కాకుండా అర్ధరాత్రి వరకు విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'జీవనదుల్లా నిరంతర చైతన్యంతో ప్రవహించాలి'

ఏలూరు : కవులు, రచయితలు, కళాకారులు జీవనదుల్లా నిరంతరం చైతన్యంతో ప్రవహించాలని సాహిత్య పరిశోధకులు డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు తెలిపారు. సాహిత్య మండలి భవనంలో అక్షరం ఆర్ట్స్ 26వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. సాహిత్య సభకు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాహిత్య, కళా రంగాలకు చాలా ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. అనంతరం ఎంఎల్‌సి షేక్ సాబ్జి మాట్లాడుతూ సామాజిక స్పృహతో రాసే సాహిత్యమే పది కాలాల పాటు ప్రజల హృదయాలలో నిలిచి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అక్షరం ఆర్ట్స్ అధ్యక్షుడు రాములు రచించిన వెలుగుపూలు శతక పుస్తకాన్ని అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

వెలుగుపూలు పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖులు

వేమన ప్రజా భాషలో ప్రజలకు అర్థమయ్యే భాషలో పద్య రచన చేసిన వారసత్వంలో రాములు కొనసాగుతున్నారని పలువురు పెద్దలు కొనియాడారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం నాట్య గురువు మేదరమెట్ల శిరీష, వారి శిష్యులు చేసిన ఆనంద తాండవం, గణేష స్తుతి, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు ఆలపించిన అభ్యుదయ గీతాలు బాగా ఆకట్టుకున్నాయి. తెలుగు అధ్యాపకురాలు డా.కొలిపాక అరుణకు సాహితీ సుధ అనే బిరుదుతో సాహిత్య పురస్కారం అందజేశారు.

బాణసంచా పట్ల అప్రమత్తంగా ఉండాలి

దీపావళి పండుగ నేపథ్యంలో సిఐ బాల సురేష్, ఎస్ఐ ఎంఎస్.కుటుంబరావు

ప్రజాశక్తి - ముసునూరు

దీపావళి పండుగ పురస్కరించుకుని భద్రతా ప్రమాణాలు దృష్టిలో ఉంచుకుని పండుగను కుటుంబసభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని నూజివీడు సిఐ బాల సురేష్, ఎస్ఐ యం.కుటంబరావులు తెలిపారు. శనివారం మండలకేంద్రమైన ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ దీపావళి టపాసులు కాల్చేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, మండలంలో టపాసులు ఎక్కడైనా అక్రమంగా విక్రయిస్తున్నా, నిల్వ ఉంచినా డయల్ 100కి, లేదా ముసునూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనుమతులు లేకుండా టపాసులు దొంగతనంగా విక్రయించరాదన్నారు. ప్రభుత్వం అనుమతులు తీసుకున్న విక్రయదారులు చట్ట నిబంధనలు పాటిస్తూ, ఊరికి దూరంగా ప్రమాదం లేని పరిసర ప్రాంతాల్లో అమ్మకాలు జరపాలన్నారు. ఇసుక, నీరు తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పని సరిగా టపాసుల విక్రమ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చిన్న పిల్లలను అమ్మకాల షాపుల్లో పెట్టుకోరాదని, పైన తెలిపిన వివరాలను పాటిస్తూ దీపావళి పండుగను జరుపుకోవాలని తెలిపారు. అనంతరం మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

భీమడోలు : భీమడోలు సర్కిల్ పరిధిలోని ప్రజలకు ఇన్స్పెక్టర్ భీమేశ్వర రవి కుమార్ శనివారం దీపావళి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు భద్రతా నియమాలు పాటిస్తూ, ఆహ్లాదకర వాతావరణంలో ఆనందోత్సవాల మధ్య పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. బాణాసంచా కొనుగోళ్ల సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇదే క్రమంలో బాణాసంచా విక్రేతలు అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచడం, అమ్మడం చేయరాదన్నారు.

మాట్లాడుతున్న నూజివీడు సిఐ బాల సురేష్, ఎస్ఐ యం.కుటంబరావు

బాలోత్సవం జయప్రదం చేయాలి

బ్రోచర్ ఆవిష్కరణలో డిఇఒ పి.శ్యామ్‌సుందర్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ శ్యాంసుందర్, జివిఎల్

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి బాలోత్సవం నాలుగవ పిల్లల సంబరాలు జయప్రదంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యాంసుందర్ ఆకాంక్షించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అపుస్మా స్కూల్స్ స్పోర్ట్స్ మీట్ సభలో హేలాపురి బాలోత్సవం 4వ పిల్లల సంబరాల బ్రోచర్‌ను డిఇఒ శ్యామ్ సుందర్, తపన ఫౌండేషన్ ఛైర్మన్ తపన చౌదరి, అపుస్మా ఏలూరు జోన్ కమిటీ సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్, తపన చౌదరిలు మాట్లాడుతూ 3 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులను భాగస్వాములను చేస్తూ, వివిధ సంఘాల పెద్దలు బాలోత్సవాలు ఏర్పాటు చేయడం గొప్ప అనుభూతి కలుగుతుందన్నారు. బాలోత్సవాల నిర్వహణకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. హేలాపురి బాలోత్సవ ఆహ్వాన సంఘం నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ డిసెంబర్ 16, 17 తేదీల్లో సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్‌లో నిర్వహించే 4వ పిల్లల సంబరాలకు ఏలూరు పరిసర 6 మండలాల నుంచి, 575 స్కూల్స్ నుంచి, ఎల్‌కెజి నుంచి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు 69 అంశాలలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించే అవకాశం ఉందని వివరించారు. విద్యార్థులు, పెద్దలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రయివేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్‌లు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వై.ఆనందనాయుడు, పి.ఆంజనేయులు, వి.సురేష్, అపుస్మా రాష్ట్ర నాయకులు ఎంబిఎస్‌వి.శర్మ, జోన్ అధ్యక్షులు కెసిహెచ్.చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలుచోట్ల 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం గూటాల సెంటర్‌లో కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రతీఇంటికి వెళ్లి మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ, పాపోలు గణపతి రత్తయ్య, కుంచె దొరబాబు, నియోజవర్గం బిసి సెల్ అధ్యక్షులు డొకల నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షులు గుబ్బా రాంబాబు, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు పిల్లి నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి నునకాని రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు : రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందరినీ ఆదుకుంటారని వలసపల్లి టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు మెదరమెట్ల సురేంద్ర తెలిపారు. శనివారం మండలంలోని వలసపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే దీపం పథకం కింద మూడు గ్యాస్ బండలు ఉచితం, మహిళలకు టికెట్ లేని బస్సు ప్రయాణం, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు రూ.18,500 నగదు బదిలీ పథకం, ఇలా పలు పథకాలను అందిస్తారని టిడిపి నాయకులు, కార్యకర్తలు వివరించారు.



ముసునూరులో పథకాలను వివరిస్తున్న నేతలు

రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షులు తేరా రాజు మృతి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షులు తేరా రాజు(49) అనారోగ్య కారణాలతో శనివారం ఉదయం మృతి చెందారు. కారుణ్య నియామకం కింద సుమారు 12 సంవత్సరాల క్రితం గ్రామ రెవెన్యూ సహాయకులుగా బాధ్యతలను స్వీకరించిన ఆయన చెట్టున్న పాడు కేంద్రంగా పనిచేశారు. సంఘం ద్వారా పలు సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు నాయకత్వం వహించేవారు. ఆయనకు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భీమడోలు డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్ ఆధ్వర్యంలోని రెవెన్యూ కార్యాలయ అధికారులు, సిబ్బంది, విఆర్‌ఒల సంఘ నాయకులు, సభ్యులు, విఆర్ఎ సంఘ సభ్యులు ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వపరంగా మంజూరైన మొత్తాలను అందజేశారు. శాఖా పరంగా ఆయన కుటుంబానికి అండగా ఉంటామని, సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ రెవెన్యూ సహాయకులుగా తేరా రాజు అందించిన సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు.



పరిశీలిస్తున్న ఎంపిపి

స్నాన ఘట్టాల పరిశీలన

ఎంపిపి సుంకర వెంకటరెడ్డి

ప్రజాశక్తి - పోలవరం

కార్తీకమాసం సందర్భంగా స్నాన ఘట్టాలను పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి శనివారం పరిశీలించారు. సంబంధిత శాఖ అధికారులతో ఆయన ఫోన్లో మాట్లాడి తగు ఏర్పాట్లు చేయాలని తెలియజేశారు. అలాగే నెక్లెస్ బెండ్, గట్టు ఎక్కి దిగేందుకు వీలుగా శుభ్రం చేయాలని సంబంధిత అధికారులను కోరారు.

రాబోయే ఎన్నికలపై జనసేన కార్యాచరణ

పోలవరం : పోలవరంలో మండల అధ్యక్షులు గుణపర్తి చిన్ని ఆధ్వర్యంలో శనివారం మండల కమిటీ, గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గం ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు పాల్గొని రాబోయే ఎలక్షన్ కార్యాచరణ, బూత్ కమిటీల నియామకం, ప్రజల్లోకి మరింత లోతుగా వెళ్లడానికి, ప్రతీ ఇంటికి వెళ్లి పవన్ కళ్యాణ్ ఉద్దేశాలు, ప్రజల కోసం ఆయన చేయాలనుకున్న మంచి పనులు గురించి వివరించడం, గ్రామాల్లో మండలాల్లో మరిన్ని కమిటీలు ఏర్పాటు చేయడం సోషల్ మీడియా యాక్టివిస్టల నియామకాలు మీద దిశా నిర్దేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కురసం రమేష్, తెలగం శెట్టి రామ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చీకట్ల సాయికృష్ణ, మూర్తి, మామిడి పల్లి వరప్రసాద్, వనిమిరెడ్డి సీతయ్య రాంబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం

జంగారెడ్డిగూడెం : వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని పట్టణ వైసిపి అధ్యక్షులు చిటికెన అచ్యుతరామయ్య తెలిపారు. శనివారం 'వై ఎపి నీడ్ జగన్' కార్యక్రమంలో భాగంగా పట్టణంలో తొమ్మిదో సచివాలయం పరిధి 24వ వార్డులో మున్సిపల్ వార్డు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్యుతరామయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు 95 శాతానికి పైగా అమలు పరచడంపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ పాలనలో చంద్రబాబు నాయుడు హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, స్థానిక కౌన్సెలర్ దొంతు మాధవ్, కన్వీనర్ బత్తిన చిన్న, సొసైటీ మాజీ అధ్యక్షులు వందనపు వెంకటేశ్వరరావు, కిషోర్, ఉగ్గం ప్రసాద్, చిప్పాడ వెంకన్న పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 634/2018, I.A. 593/2012
O.S. 329/2010
పిటీషనరు/పిటీషనరు/వాది:
నాళం వెంకట లక్ష్మీనారాయణ
Vs
రెస్పాండంట్లు/రెస్పాండెంట్లు/ప్రతివాద్లు:
తమ్మినైన హరికృష్ణ (died)
శ్రీమతి తమ్మినైన లక్ష్మి
To రెస్పాండెంటు:
2) శ్రీమతి తమ్మినైన లక్ష్మి, W/o. లేటు హరికృష్ణ, రామచంద్రరావుపేట, ఏలూరు, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా ELR SCJC Limits.
పై నెంబరు దావాలో వాది/పిటీషనరు అయిన నాళం లక్ష్మీనారాయణపై దివి. 09-04-2018 సం॥ తేదీన I.A. 593/2012 జప్తు పిటీషనులోను, దావాలోను శ్రీ కోర్టు వారు పాస్ చేసిన Default Order ను రద్దుచేసి, జప్తు పిటీషనును, దావాను Restore చేయించమని పిటీషనరు/వాది దాఖలు చేసిన పై నెంబరు జప్తు పిటీషను I.A. 593/2012 దావాలోనూ మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక బుద్ధిపూర్వకంగా Avoid చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం యీ పేపరు ప్రకటన యివ్వబడినది. కాబట్టి దివి. 24-11-2023 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥ల లగాయితూ మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
వాయిదా: 24-11-2023
కె.వి.వి.హరిమోహన్
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్
కొవ్వూరు కొవ్వూరు
06-11-2023 సెల్:9160061613